క్లుప్తంగా

అభయతో మహిళలకు రక్షణ



అభయపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: మహిళల రక్షణ కోసం పోలీసులు ఏర్పాటు చేసిన అభయపై శుక్రవారం బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో సీనియర్ విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి సూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకురాలు లావణ్య మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణకు ఏర్పాటు చేసిందే అభయ అని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం



మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఫీల్డ్ అసిస్టెంట్ ఏడుకొండలు

దెందులూరు: కూటమి ప్రభుత్వం నాయకులు గత ప్రభుత్వంలో నియమితులైన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తున్నారని విధులనుంచి తొలగించబడిన గాలాయగూడెం ఫీల్డ్ అసిస్టెంట్ కొండపల్లి ఏడుకొండలు అన్నారు. శుక్రవారం తాడేపల్లిలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆయన కలిశారు. ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి కుటుంబాలన్నీ రోడ్డున పడేలా చేశారని వివరించారు. కొంతకాలం ఓపికపడితే వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, న్యాయం చేస్తుందని మాజీ సీఎం జగన్ భరోసా ఇచ్చారని ఏడుకొండలు తెలిపారు.

టీచర్ల పని సర్దుబాటు తరచూ వద్దు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తరచూ పని సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఆందోళనకు, గందరగోళానికి గురవుతున్నారని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగులోతు కృష్ణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రత్నం బాబు, జి.మోహన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాత్కాలిక పని సర్దుబాటుకు విరామం పలికి, అవసరమైన చోట విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలని గతంలో మాదిరి నెలవారి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన స్థానంలో పదోన్నతులు ఇవ్వడం ద్వారా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత నివారించవచ్చని సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలంటూ పైలెట్ ప్రాజెక్టును తీసుకురావడం శోచనీయమని తెలిపారు. పీఎం శ్రీ యాప్ అనుసంధానంతో పాఠశాల గ్రాంట్లు జమ చేయడంలో ఉన్న షరతులను ఎత్తివేసి పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో నేరుగా జమయ్యేటట్లు చూడాలని కోరారు. నిధులు మంజూరయ్యి నెల కావస్తున్నా పలు పాఠశాలలకు ఇంకా గ్రాంట్లు జమ కాలేదని తెలిపారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): త్వరలో జరిగే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.రాంబాబు, నాదెండ్ల బాబ్జి ఒక ప్రకటనలో తెలిపారు. పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకుల గొంతును చట్టసభలో వాడిగా వినిపించ గలరని విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు.

యాంటీబయోటిక్స్ వాడొద్దు



ఏలూరు జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ఏలూరు టౌన్: రోగ నిరోధక శక్తిని పెంచుకుంటూ భవిష్యత్తులో ఆయా రోగాల నుంచి కాపాడుకునే అవకాశం ఉందని, మితిమీరి మందులు వినియోగించటం ద్వారా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో శుక్రవారం ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ యాంటీ మైక్రోబయాల్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మనిషీ రోగ నిరోధక శక్తిని పెంచుకోవటం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. అవసరానికి మించి యాంటీబయోటిక్స్ వినియోగించకూడదని, డాక్టర్‌ను సంప్రదించకుండా స్వయంగా మందులు వినియోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు, డీఎంహెచ్‌ఓ ఎస్ శర్మిష్ట, డీసీహెచ్ఎస్ పాల్ సతీష్‌కుమార్, ఆర్‌ఎంఓ డి.దుర్గాకుమార్, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ శశిధర్, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి, విద్యార్థులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

సివిల్ సప్లయిస్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్



భీమడోలు : పాతూరులోని ఎంఎల్‌సీ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎండీ మనజీర్ జిలానీ సమూన్

భీమడోలు: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పౌరసరఫరాల విభాగం వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. సూరప్పగూడెంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను, పోలసానిపల్లి రైతు సేవా కేంద్రాన్ని, అంబర్‌పేటలోని శ్రీదుర్గా ఆగ్రో ఇండస్ట్రీస్‌ను శుక్రవారం జేసీ ధాత్రిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. పోలసానిపల్లి రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులతో మాట్లాడారు. గోనె సంచులు కొన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడాన్ని గుర్తించారు. రైతులు దిగుమతి, ఎగుమతి ఖర్చులు భరించాల్సిన అవసరం లేదన్నారు. రైతు సేవా కేంద్రంలో సిబ్బంది నిర్ధారించిన తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలే తప్ప రైసు మిల్లర్లు తమ మిల్లు వద్ద తేమ శాతాన్ని లెక్కించి తేడా ఉందని రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఆదేశించారు. రైతులు తమకు నచ్చిన మిల్లులకే ధాన్యాన్ని తరలించుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. ఏలూరు జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు 250 రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు రూ.136.44 కోట్ల విలువ చేసే 6164 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నట్టు చెప్పారు. తొలుత పాతూరు ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలించి నిత్యావసర సరుకులను సరైన పద్ధతిలో సరైన తూకంతో పంపిణీ చేయాలని ఆదేశించారు.

మిల్లులకు నోటీసులు

జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ధాన్యం అన్‌లోడింగ్‌లో ఆలస్యం, గోనె సంచుల్లో నాణ్యత లేకపోవడంతో అంబర్‌పేట పరిధిలోని శ్రీదుర్గా ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును కొన్నిరోజులు సస్పెండ్ చేశామన్నారు. నిర్ణీత సమయంలోపు అన్‌లోడింగ్ చేయనందున కొవ్వలిలోని రైస్ బాలాజీ రైస్‌మిల్లు, మండవల్లి మండలం భైరవపట్నంలోని హేమవర లక్ష్మీ ట్రేడర్స్, అన్నపూర్ణ ట్రేడర్స్, పూళ్లలోని శ్రీవెంకట సుబ్బరాజు రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లులకు నోటీసులు జారీ చేశామని డీఎస్‌ఓ ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ ఎన్.శ్రీలక్ష్మీ, డీసీఓ ఎ.శ్రీనివాస్, తహసీల్దార్ బి.రమాదేవి, ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు



గణపవరం ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

గణపవరం: ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి గిట్టుబాటు ధర పొందాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన గణపవరం మండలం కాశిపాడులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ సీజన్‌లో ప్రభుత్వం కామన్‌రకం ధాన్యం క్వింటాలుకు రూ.1725, ఎ.గ్రేడు రకం ధాన్యం రూ.1740 చొప్పున మద్దతు ధర అందిస్తున్నట్టు చెప్పారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలకు సొమ్ము జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ యర్రంశెట్టి ప్రసాద్, వీఏఏ రవీంద్ర పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీ గంజి రాజీమనోజ్

ఉంగుటూరు: నారాయణపురంలో ఆక్రమణల నేపథ్యంలో మిగిలిన 25 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చే పక్రియలో ఆర్ అండ్‌బీ, విద్యుత్, పంచాయతీ రాజ్ అధికార్లు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ గంజి రాజీమనోజ్ ఆదేశించారు. ఉంగుటూరులో శుక్రవారం ఆయన మండల స్థాయి అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. హౌసింగ్ పెండింగ్ బిల్లులు వెంటనే రప్పించాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అన్నారు. వసతి గ్రహాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ఏఎస్‌డబ్ల్యూఓ కోరారు. హౌసింగ్ ఏఈలు సురేష్, రమేష్, విద్యుత్ ఏఈ శ్రీరామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పరామర్శించిన రవి కుమార్



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న రవికుమార్

దెందులూరు: ఫుడ్ పాయిజన్ అయి ఆసుపత్రిలో ఉన్న విద్యార్థులను మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు అలగా రవికుమార్, ఉపాధ్యక్షులు నల్లమిల్లి శంకర్, పల్లా యేసోబులు పరామర్శించారు. దెందులూరు మండలం జోగన్నపాలెం దళితవాడలో ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీసుకుని 9 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడం బాధాకరమన్నారు. ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను వారు పరామర్శించారు. చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను కోరారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. చిన్నారులను పరామర్శించిన వారిలో పల్లవారిగూడెం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పల్లా ఏసోబు, వైఎస్సార్ సీపీ కొమిరేపల్లి నాయకులు చట్టుమాల బాలకృష్ణ, దళిత సంఘం నేత కొమ్మిన ఆగస్టీన్, తోటరాజు, నిట్టా శ్రీను ఉన్నారు.

కోలుకున్న చిన్నారులు



కోలుకున్న చిన్నారులు

దెందులూరు: జోగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో అస్వస్థతకు గురైన 9 మంది విద్యార్థులను శుక్రవారం ఎంఈఓ కె.అన్నమ్మ ఏలూరు వైద్యశాలలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధిత చిన్నారులందరూ కోలుకున్నారని ఆమె తెలిపారు. సాయంత్రం విద్యార్థులందరినీ డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు వెల్లడించినట్టు చెప్పారు. ఎంఈఓ వెంట పాఠశాల హెచ్ఎం వెంకటలక్ష్మి ఉన్నారు.

గ్రామీణ కృషి రైతులకు అవగాహన



కొప్పాకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదవేగి : మండలంలోని కొప్పాక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామీణ కృషి అనుభవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థ మార్కాపురం ఎస్ఎస్ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు గ్రామ వ్యవస్థ పనితీరు, వ్యవసాయ విధి విధానాలు తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కె.ఫణి కుమార్ సూచించారు. గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం అనే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వ్యవస్థ ఎలా ఉందనే అంశంపై కొప్పాక గ్రామపటాన్ని వర్ణించి వ్యవసాయ అభివృద్ధి దృష్ట్యా గతంలో, ఇప్పుడు వ్యవసాయ రంగంలో జరిగిన విప్లవాత్మక మార్పులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏలూరు విస్తారణ శాస్త్రవేత్త ఎస్ నాగేంద్ర బాబు, పెదవేగి ఏఓ ప్రియాంక, కొప్పాక సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

యాంటీబయోటిక్స్ వాడకం అనర్థదాయకం



శిక్షణ పొందిన రైతులతో మత్స్యశాఖ అధికారులు

గణపవరం: ఆక్వాసాగులో విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్ వాడకం అనర్థదాయకమేకాక రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుతుందని మత్స్యశాఖ నిపుణులు ఎ.ఆనందకుమార్, ఎస్ దుర్గారావు అన్నారు. శుక్రవారం గణపవరంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ ఉపప్రాంతీయ విభాగం, గణపవరం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన ఆక్వారైతుల శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో వారు పాల్గొన్నారు. రైతులు మత్స్యశాఖ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకుని సాగులో మెళకువలు పాటించడం ద్వారా సాగును లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న రైతులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మండల ఎఫ్‌డీఓ శివరామకృష్ణ, మత్స్యశాఖ సహాయకురాలు బి.షర్మిలాదేవి, భాస్కర్, రాము, మత్స్యశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎకరాకు 28 బస్తాల దిగుబడి



కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జేడీ హబీబ్ బాషా

దెందులూరు: కొవ్వలిలో పంటకోత ప్రయోగాన్ని శుక్రవారం వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ షేక్ హబీబ్ బాషా పరిశీలించారు. దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ధామా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొవ్వలిలో ఎంపీయూ 1121రకం వరిపంట కోత ప్రయోగం చేశారు. ఎకరానికి 28 బస్తాలు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.సుబ్బారావు, ఏఈఓలు డి.నారాయణమూర్తి, వరప్రసాద్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల సమస్యలపై వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న ఏఎన్ఎంలు

పెదవేగి : మండలంలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించే గ్రేడ్-3 ఏఎన్ఎంలు తమ సమస్యలపై ఎంపీడీఓ పి.శ్రీనివాస్‌కు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) నాయకుడు బట్టు విజయ్‌వర్ధన్ బాబు వివరించారు. ఏఎన్ఎంలతో వైద్య ఆరోగ్య శాఖకు సంబంధంలేని విధులు అప్పగిస్తున్నారని, దీంతో వారు మానసిక, శారీరక ఒత్తిడులకు గురవుతున్నారని వివరించారు. గ్రేడ్-3 వైద్య సిబ్బందికి వైద్యశాఖతో సంబంధంలేని విధులు అప్పగించవద్దని ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఏఎన్ఎంల సంఘ నాయకురాలు పల్లికొండ రాణి, ఎంఎల్‌హెచ్‌వీ పావని, ఆశ కార్యకర్తలు దుర్గ, కమురున్నీసా పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు





విజేతలకు బహుమతులు అందిస్తున్న రవీంద్ర, నత్తానియేలు

దెందులూరు: ఇంట్రామ్యూరల్ పోటీలు విద్యార్థుల్లో అంతర్గత ప్రతిభను వెలుకతీస్తుందని క్యాడ్బరీ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ రవీంద్ర, తడికలపూడి ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎంఎస్ రాజా, పోతునూరు హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం కృష్ణారావు అన్నారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో మహిళ, పురుషుల విభాగాల్లో జరిగిన ఇంట్రామ్యూరల్ వాలీబాల్ పోటీల్లో విజేతలైన సైనా నెహ్వాల్ హౌస్, రవికుమార్ దాహియా హౌస్‌లకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియల్ అధ్యక్షతన బహుమతులు ప్రదానం చేశారు. క్రమశిక్షణ ఓర్పు ప్రతి విద్యార్థికీ ఎంతో అవసరమన్నారు. వ్యాయామ విద్యకు రాబోయే కాలంలో ఉన్నత భవిష్యత్తు ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రాజెక్టు డైరెక్టర్ సొంగా దిలీప్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డి.రత్నబాబు, అధ్యాపకులు ఉన్నారు.

మహాలనోబిస్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రముఖ గణాంకవేత్త ఆచార్య ప్రశాంత చంద్ర మహాలనోబిస్ అంతర్జాతీయ పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్ ప్రభాకర రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ స్టేస్టిక్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మహాలనోబిస్ జ్ఞాపకార్థం అంతర్జాతీయ పురస్కారాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఏటా గణాంక పద్ధతుల్లో గణనీయమైన కృషి చేసిన, అభివృద్ధి చెందుతున్న దేశానికి చెందిన గణాంక నిపుణుడికి ఈ అవార్డును ఇస్తున్నట్టు వివరించారు. డిసెంబర్ 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

మందులపై జీఎస్టీ ఎత్తివేయాలి



డీఆర్‌ఓ విశ్వేశ్వరరావుకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : అత్యవసర మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని, కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, మెడికల్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ యూనియన్ నాయకులు శుక్రవారం డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు ద్వారా జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం సాయంత్రం ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటిటీ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు మద్దతుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వినతి పత్రం అందజేశారు. ఢిల్లీలో ధర్నాకు మద్దతుగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు వ్యక్తం చేశామని యూనియన్ అధ్యక్షులు బీవీ సత్యనారాయణ తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తోందని విమర్శించారు కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పి.కిషోర్, మెడికల్ రిప్రజెంటిటీస్ యూనియన్ నాయకులు ఉమా మహేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ యువతకు కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ తెలిపారు. 30 రోజుల పాటు కంప్యూటర్ ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు ఫోన్ నెంబర్లు 95027 23561, 90140 40780, 95330 79471లో సంప్రదించాలన్నారు.

దత్తత మహోత్సవం

ఏలూరు (టూటౌన్): దత్తత ప్రభుత్వం ద్వారానే తీసుకోవాలని శిశుగృహ మేనేజర్ కె.భార్గవి అన్నారు. స్థానిక ఏలూరు అర్బన్ సెక్టార్ గౌరవరం శనివారపు పేట పరిధిలో దత్తత మహోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. శనివారపుపేట కమ్యూనిటీ లెవెల్‌లో అవగాహన కల్పించారు.

ఇందిరమ్మ కాలనీలో సమస్యల తిష్ట

- సుద్ద, ఉప్పు నీటితో అవస్థలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



వర్షాకాలంలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు (ఫైల్)



కొత్తూరు ఇందిరమ్మకాలనీలో నీటి బోరు

ఏలూరు రూరల్ : ఏలూరు నగర కార్పొరేషన్ పరిధిలోని కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. నీరు తాగడానికి పనిచేయడంలేదు. ప్రధాన రోడ్డు గోతులమయంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగు నీరు ముందుకు పారడంలేదు. అరకొర వసతులు మధ్య కాలనీలో ఐదు వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా అధికారులు తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోతున్నారు. వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఉండే ఒకనాడు కొత్తూరు నాలుగేళ్ల క్రితం ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైంది. వైఎస్సార్ సీపీ హయాంలో వీధుల్లోని సీసీ రోడ్లు, డ్రెయినేజీని అభివృద్ధి చేశారు. ప్రధాన రోడ్లు, డ్రెయినేజీతోపాటు తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు.

ఉప్పునీరే దిక్కు

కాలనీ ఏర్పడి సుమారు 15 ఏళ్లయింది. నేటికీ అక్కడ పేదలకు సురక్షిత తాగునీరు అందడం లేదు. నగర ప్రజలకు అందిస్తున్న గోదావరి నీటిని కాలనీ ప్రజలకు కూడా అందిస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఎమ్మెల్యే బడేటి చంటి నేటికీ నెరవేర్చ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నేళ్లుగా అధికారులు బోర్లద్వారా ఉప్పు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీటితో కనీసం అన్నం కూడా వండుకోలేకపోతున్నామని మహిళలు చెబుతున్నారు. బోరు నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులు వస్తున్నాయని వాపోతున్నారు. ప్రతి కుటుంబం రోజుకు కనీసం రూ.20లు ఖర్చు చేసి రెండు టిన్నుల తాగు నీరు కొనుక్కోవాల్సి వస్తోంది. బోరునీరు సామాన్లు కడిగేందుకు, కాలకృత్యాలు తీర్చుకోడానికే పనికొస్తున్నాయని మహిళలు చెబుతున్నారు.

ప్రధాన రోడ్డు అధ్వానం

కాలనీలో ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. పెద్దపెద్ద గోతులతో ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీలో మురుగు నీరు ఎగదన్ని ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. దీనివల్ల మురుగు నిలిచిపోయి చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది. వర్షాకాలంలో దోమల వృద్ధి చెంది పిల్లలు, పెద్దలు విషజ్వరాల బారిన పడుతున్నారని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

ఇంటి పన్ను పెంచారు



గతంలో పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు ఏడాదికి రూ.600 ఇంటి పన్ను కట్టించుకున్నారు. తమ కాలనీ ఏలూరు నగర కార్పొరేషన్ పరిధిలో విలీనమవడంతో ఇప్పుడు రూ.1200కు ఇంటి పన్ను పెంచారు. పన్నులు పెంచారు సరే.. సురక్షిత తాగునీరు సరఫరా చేయడంలేదు. దీనిపై కొద్ది నెలల క్రితం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించాం. కార్పొరేషన్ అధికారులను కలవాలన్నారు. ఎన్నిసార్లు కలిసిన మా సమస్యకు పరిష్కారం లభించడంలేదు.

– భారతి, కాలనీవాసి


డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి



వర్షాకాలంలో మా కాలనీ బురదగా మారిపోతోంది. మురుగునీరు, వర్షపునీరు కిందికి పారడం లేదు. లోతట్టున ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు మూడు నెలలు నిలిచిపోతోంది. దీనివల్ల దోమలు ఉధృతి పెరుగుతుంది. చీకటి పడితే చాలు దోమలు నిద్ర కూడా చేస్తున్నాయి. అధికారులు డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయించాలి.

– శాంతి, కాలనీ వాసి

ప్రధాన రోడ్డు అభివృద్ధి చేయాలి



గత ప్రభుత్వ హయాంలో వీధిలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేశారు. కాలనీలో ప్రధాన రోడ్డు అభివృద్ధి నిలిచిపోయింది. ఈ రోడ్డుపై పెద్ద గోతుల కారణంగా ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో మా కష్టాలు చెప్పుకోలేనివి. కాలనీలో అందరూ రెక్కాడితే గాని డొక్కాడని పేదలమే. ప్రతిరోజూ ఉదయం ఏలూరు వచ్చి కాయకష్టం చేసుకుని సాయంత్రం ఇంటికి చేరుతారు. అధికారులు ప్రధానరోడ్డు అభివృద్ధి చేసి రాత్రి వేళ్ల లైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– వరలక్ష్మి, కాలనీ వాసి

ఉప్పు, సుద్ద నీరే దిక్కు



కాలనీల్లో వేసిన బోర్లు నుంచి సుద్ద, ఉప్పునీరు వస్తోంది. ఈ నీరు తాగలేక నానా ఇబ్బందులు పడుతున్నాం. రోజుకు కనీసం రూ.20 తాగునీటికి ఖర్చు చేయాల్సి వస్తోంది. కనీసం వంట చేసుకోవడానికి కూడా సుద్ద నీరు పనిచేయడంలేదు. అన్నం వండితే చిమిడిపోతుంది. స్నానం చేద్దామంటూ చర్మ వ్యాధులు వస్తాయేమోనని భయం. కాలకృత్యాలు తీర్చుకోడానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. అధికారులు మాకు సుద్ధి చేసిన గోదావరి నీరు సరఫరా చేయాలి.

– విజయమ్మ, కాలనీ వాసి